
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు
5
మంగళవారం 25 నవంబరు 2025

పేదలకు గృహయోగం



- రేషన్‌కార్డు, సొంత స్థలమే అర్హత
- లబ్ధిదారుల కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సర్వే
- సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం
- నెలాఖరు వరకు స్వీకరణ

నంద్యాల కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు మరిన్ని ఇళ్లు మంజూరు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముందుగా సొంత ఇంటి స్థలం ఉన్నవారికి పక్కా ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంది. ఆవాజ్ యోజన పథకంలో భాగంగా గ్రామాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. గృహ నిర్మాణశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. జాబితా సిద్ధమయ్యాక కేంద్ర ప్రభుత్వ వాటాకు, రాష్ట్రవాటా కూడా జతచేసి లబ్ధిదారుల ఖాతాల్లో విడతలవారీగా జమ చేసేందుకు రూపకల్పన చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఏమాత్రం ఇవ్వకుండా పేదల సొంతింటి కలను దూరం చేశారు. కాని కూటమి ప్రభుత్వం మాత్రం పేదలకు సొంత ఇంటి నిర్మాణం కల్పించే దిశగా వెళ్తోంది. అంతేకాకుండా పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు కూడా సంకల్పించింది. ఇదిలా ఉండగా నంద్యాల జిల్లాలో ఇప్పటి వరకు 31,072 మంది ఇంటి నిర్మాణానికి హౌసింగ్ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన వారి వివరాలను క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్వే చేస్తున్నారు. లబ్ధిదారుడి ఫొటోతో పాటు ఆ స్థలాన్ని జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సమీప సచివాలయాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

● జియో ట్యాగ్‌తో అర్హుల లెక్క పక్కా

కేంద్ర ప్రభుత్వం పీఎంఏవైజీ (ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్) పథకంలో భాగంగా అర్హుల వివరాలను అప్‌లోడ్ చేయమని ఓ యాప్‌ను రూపొందించింది. అందులో అర్హుల జాబితా వివరాలు మాత్రమే కాకుండా ఇంటి స్థలమున్న ప్రాంతాన్ని జియో ట్యాగింగ్ కూడా చేయాల్సి ఉంది. ఈ గడువు ఈనెల 5వతేదీ ముగియగా, యాప్ సరిగ్గా పనిచేయని కారణంగా వివరాలను సరిగా నమోదు చేయలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు దాకా గడువు పొడిగించింది. త్వరితగతిన అర్హుల వివరాలను యాప్‌లో



అప్‌లోడ్ చేస్తామని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు.

● పెరగనున్న యూనిట్ కాస్ట్

కేంద్ర ప్రభుత్వం తనవాటాను ఇదివరకే ప్రకటించింది. పట్టణాల్లో రూ.1.50లక్షలు, గ్రామాల్లో రూ.1.59లక్షలుగా యూనిట్ కాస్ట్‌ను నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20లక్షల బేసిక్ యూనిట్ కాస్ట్‌కు అదనంగా ఉపాధి హామీ కింద రూ.27వేలు, స్వచ్ఛభారత్ కింద రూ.12వేలను ఇస్తున్నారు. ఇలా మొత్తంగా రూ.1.59లక్షలు అందుతాయి. ఇదంతా కేంద్ర వాటానే. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా ఇవ్వనుంది. అయితే ఎంత అనేది ఇంకా స్పష్టత రాలేదు. కనీసం రూ.లక్షకు పైగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షల వరకు ప్రభుత్వాల సాయం వచ్చే అవకాశం ఉంది.



అర్హుల జాబితా పూర్తి చేయాలి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై గ్రామీణ్ పథకంలో అర్హుల జాబితా ఈ నెల 30వ తేదీ లోపల పూర్తి చేయాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లబ్ధిదారులను గుర్తించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

వైసీపీ హయాంలో ఇబ్బందులు

వైసీపీ హయాంలో కేంద్రం 39,570 వేల ఇళ్లను మంజూరు చేస్తే వాటిలో 28,465 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 11,105 ఇళ్లు పూర్తికాలేదు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50లక్షల యూనిట్ కాస్ట్‌తో పాటు రూ.30వేల ఉపాధి నిధులను అందించింది. దీనికి అప్పటి వైసీపీ ప్రభుత్వం అదనపు వాటా ఇవ్వలేదు. దీంతో నిర్మాణానికి ఆ డబ్బులు సరిపోక, కొండల్లో గుట్టల్లో, ఇచ్చిన పట్టా నివాసయోగ్యంగా లేక.. చాలా మంది పేదలు ఇళ్లను నిర్మించుకోలేదు. తన వాటా నయాపైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం ఆయా కాలనీలకు జగనన్న కాలనీ అంటూ పేరు పెట్టుకోవడం గమనార్హం.

● రూ.2.50లక్షలతో కొత్తగా జిల్లా వ్యాప్తంగా రూరల్ పరిధిలో 28,724 మున్సిపాలిటీ పరిధిలో 2,348 మొత్తం కలిసి 28,724 గృహాలు మంజూరుకాగా రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం ఇటీవల పండుగలా గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లాలో 4,161 మందికి ఇంటి తాళాలు అందించిన విషయం తెలిసిందే. పీఎంఏవైజీలో భాగంగా ఓ వైపు జిల్లాకు సంబంధించి గృహాల మంజూరుకు సర్వే జరుగుతుండగా మిగిలిన లబ్ధిదారుల కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్వే నిర్వహిస్తున్నారు. ఐదు మున్సిపాలిటీలతో పాటు నంద్యాల నియోజవర్గంలోని అన్ని మండలాలకు ఈ కొత్త గృహాల్ని కేటాయించారు. వీటికి కేంద్రం ఇచ్చే రూ.1.50లక్షలతో పాటు రాష్ట్రం కూడా రూ.లక్ష వేసి మొత్తంగా రూ.2.50లక్షల్ని అందించనుంది. పీఎంఏవైజీలో మంజూరయ్యే గృహాలకు రాష్ట్ర వాటా ఇంకా ఖరారు కాలేదు. అయితే 2014-19 మధ్య కూడా కేంద్రం రూ.1.50లక్షలు సాయం అందించింది. అందుకు అదనంగా టీడీపీ ప్రభుత్వం తన వాటా రూ.లక్ష వేసి యూనిట్ కాస్ట్‌ను రూ.2.50లక్షలుగా చేసింది. దీంతో అప్పట్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా జరిగాయి. ఈ సారి కూడా రాష్ట్ర వాటా వేస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ఇదివరకే ప్రకటించారు. గతంలో కన్నా ఈసారి రాష్ట్ర వాటా భారీగా పెరిగే అవకాశం ఉంది.



అన్నదాతలకు అండగా ప్రభుత్వం

- మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- పోలూరులో 'రైతన్న-మీ కోసం'



కరపత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి

నంద్యాల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల మండలం పోలూరు గ్రామంలో వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'రైతన్న-మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం రైతులకు ఉపయోగపడే పంచ సూత్రాలను వివరించారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు ఈ ఐదు వ్యవసాయంలో పెను మార్పులు తీసుకువచ్చి అన్నదాతకు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. ఈ సందర్భంగా కర పత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునగాల విశ్వనాథ్‌రెడ్డి, జోజిరెడ్డి, జయచంద్రారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసపోకండి

- ఎస్పీ సునీల్ షెరాన్
- పీజీఆర్ఎస్‌కు 82 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ సునీల్ షెరాన్

నంద్యాల టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొందరు డబ్బులు తీసుకుని మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి మాటలను నమ్మకూడదని ఎస్పీ సునీల్ షెరాన్ యువతకు సూచించారు. సోమవారం నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్ట పరిధిలోని ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువులోగా ఫిర్యాదులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఆదే సమస్యలు మళ్లీ పీజీఆర్ఎస్‌కు రాకూడదన్నారు. మొత్తంగా 82 ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిలో ప్రధానంగా.. ఇంటి స్థలం ఇప్పిస్తామని నరసింహులు అనే వ్యక్తి రూ.6లక్షలు తీసుకుని మోసం చేశాడని నెహ్రూనగర్‌కు గ్రామానికి చెందిన భువనేశ్వరి ఫిర్యాదు చేశారు. తప్పుడు దస్తావేజుల సృష్టించి తనదికాని స్థలాన్ని తనదేనని చెప్పి నాగరాజు అనే వ్యక్తి రూ.10లక్షలు తీసుకుని మోసం చేశాడని యళ్లూరుకు చెందిన మహమ్మద్ హుసేన్ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇమ్మానియేలు అనే వ్యక్తి యర్రగుంట్ల గ్రామంలో అంగన్‌వాడీ ఉద్యోగం ఇప్పిస్తామనని చెప్పి రూ.2.5 లక్షలు తీసుకుని మోసం చేశారని నంద్యాల పట్టణానికి చెందిన కాశమ్మ ఫిర్యాదు చేశారు. ఖాజా హుసేన్ అనే వ్యక్తి ట్రాక్టర్ బాడుగకు ఇస్తే ప్రతి నెల డబ్బులు ఇస్తానని చెప్పి ట్రాక్టర్ తీసుకుని డబ్బులు ఇవ్వకుండా, ట్రాక్టర్ ఇవ్వకుండా అడిగితే బెదిరిస్తున్నాడని వెలుగోడుకు చెందిన ముర్తుజావలి ఆవేదన వ్యక్తం చేశారు.

లిఫ్ట్ ఇరిగేషన్ మరమ్మతుకు నిధులు

రూ.38 లక్షలు మంజూరు చేశామన్న కలెక్టర్



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగటూరు లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ మరమ్మతు పనులకు రూ.38 లక్షల నిధులను కలెక్టర్ రాజకుమారి విడుదల చేశారు. సోమవారం నియోజకవర్గంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తీసుకెళ్లారు. రబీ సీజన్ ప్రారంభం అయ్యిందని నాగటూరు ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగు నీరు అందించాల్సి ఉందన్నారు. గత కొంత కాలంగా నాగటూరు ఎత్తిపోతల పథకం విద్యుత్ మోటార్లు మరమ్మతులు రావడంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. కాబట్టి మోటారు మరమ్మతులకు నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను గతంలోనే కోరారు. దీంతో కలెక్టర్ రాజకుమారి నాగటూరు ఎత్తిపోతల పథకం విద్యుత్ మోటార్ల మరమ్మతులకు రూ.38 లక్షల నిధులను కేటాయించారు. నిధులను కేటాయించినందుకు ఎమ్మెల్యే కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పగిడ్యాల, జూపాడుబంగ్లా మండలాల కన్వీనర్లు పలుచాని మహేశ్వరరెడ్డి, గుండ్రెడ్డి మోహన్‌రెడ్డి, షమీం, చిన్నయ్య, ఖాదర్, మల్లికార్జున్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సగినెల ఉసేనయ్య ఉన్నారు.

రీ ఓపెన్ దరఖాస్తులను పరిష్కరించండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రీ ఓపెన్ అయిన దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించాని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల వేదిక ద్వారా ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగవంతంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. రీ ఓపెన్ అయిన 479 దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే క్లియర్ చేయాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా, నాణ్యంగా ఉండాలన్నారు. బియాండ్ ఏసీఏలో ఉన్న 5 దరఖాస్తులు, ఇంకా చూసుకొని దరఖాస్తులు 63 ఉన్నాయని.. ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ కార్తీక్, డీఆర్వో రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలి

ఈ నెల 7న జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆమె అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నందికొట్కూరు మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని మద్యం దుకాణం విద్యార్థుల్లో చెడు అలవాట్లకు దారితీస్తోందని వచ్చిన ఫిర్యాదుపై దాన్ని వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఇదే మండలంలో నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 340సీ రహదారి కారణంగా బ్రాహ్మణకొట్కూరు రైతులు సాగు భూములకు వెళ్లలేకపోతున్న సమస్యను పరిష్కరించాలని ఎన్‌హెచ్ అధికారులకు సూచించారు. హంద్రీ-నీవా కెనాల్ పనుల్లో పొలాల్లో పడిన ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.


హైడ్రామా..!

- ఉత్కంఠగా మాచినేనిపల్లె సహకార సంఘం ఎన్నికలు
- రెండు నామినేషన్లు దాఖలు
- ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించిన ఎన్నికల అధికారి
- అందుకు భిన్నంగా ఎంపీడీఓ ప్రకటన



మాచినేనిపల్లె పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం భవనం

నంద్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ పరిధిలో ఉన్న మాచినేనిపల్లె పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం పాలకవర్గ ఎన్నికలో హైడ్రామా నడిచింది. సోమవారం రుద్రవరం మండలం మాచినేనిపల్లె గ్రామంలో సహకార సంఘం పాలకవర్గ ఎన్నికలకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. మాచినేనిపల్లె సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రతాప్‌రెడ్డి నోటీసును విడుదల చేశారు. కేవలం రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసిందని ఆ నోటీసులో వెల్లడించారు. ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి, ఎం.జెల్లయ్య మాత్రమే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవం అనివార్యమైంది. అయితే ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంపీడీఓలు తెలిపారు. విజయ డెయిరీ పరిధిలో ఆరు విడతలుగా జరగాల్సిన ఎన్నికలు ఇప్పటి వరకు 3 విడతలు మాత్రమే జరిగాయి. ఇందుకోసం టీడీపీ, వైసీపీ నాయకులు బలంగా ప్రయత్నాలు చేస్తున్నారు.



ఎంపీడీఓ నోటీసు

మాచినేనిపల్లి ఎన్నికపై విభిన్న ప్రకటనలు

పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికల అధికారి మాచినేనిపల్లె పాలకవర్గ కమిటీ ఏకగ్రీవమైనట్లు సాయంత్రం ప్రకటించారు. అయితే ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ప్రకటన మాత్రం మరోలా ఉంది. నామినేషన్ వేసేందుకు ఎవరూ రాకపోవడంతో ఎన్నికల ప్రక్రియ జరగలేదంటూ నోటీసును విడుదల చేశారు. దీంతో రెండు రకాలుగా వచ్చిన విభిన్నప్రకటనతో ప్రజలు ఖంగుతిన్నారు. ఏదిఏమైనా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అధికారి ప్రకటనే ఫైనల్ అంటూ చర్చనీయాంశంగా మారింది.

మిగతా 6వ పేజీలో



ఎర్రగుడిదిన్నెలో మాజీ ఎమ్మెల్యేను గృహ నిర్బంధం చేసిన దృశ్యం

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి: ఈవో

శ్రీశైలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): భక్తులు సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలని శ్రీశైల ఆలయ ఈవో శ్రీనివాసరావు భక్తులకు సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యాత్రికులు ఆన్‌లైన్ ద్వారా అవసరమైన సేవలు పొందడానికి తొందరపాటుగా తప్పుడు వెబ్‌సైట్లతో మోసపోతున్నారని చెప్పారు. మల్లికార్జున సదన్, గణేష్ సదన్‌తోపాటు రెండు రోజుల క్రితం టూరిజంశాఖ వారి వెబ్‌సైట్‌కు సమానంగా తలపించేలా ఉండే ఫేక్ వెబ్‌సైట్‌లో యాత్రికులు నష్టపోవడంపై సైబర్ క్రైం వారికి తెలియజేసినట్లు చెప్పారు. సోమవారం టూరిజం అధికారులతో కీలక విషయాలపై చర్చించారు. ప్రధానంగా యాత్రికులు ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉండే ప్రతి అక్షరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాకే ఎంటర్ అవ్వాలని సూచించారు. అలాగే నగదు చెల్లింపుల కోసం వ్యక్తిగత చాటింగ్‌లు, వాయిస్ కాల్స్ వంటివి వస్తే నమ్మవద్దని అన్నారు. శ్రీశైల క్షేత్రానికి వచ్చే యాత్రికులను సైబర్ మోసాలకు గురి చేస్తున్న వారిపై విచారణ చేసి తగు చర్యలు తీసుకునేలా పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆన్‌లైన్ లావాదేవీలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యాత్రికులు తమకు కావాల్సిన సమాచారం లేదా సందేహాలను నివృత్తి చేసుకునేందుకు కాల్ సెంటర్ నెంబర్లు 8333901351,52,53లకు ఫోన్ చేసి తెలుసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రూపాయిస్తే చాలు ఇంటి ప్లాన్‌కు అనుమతి

- పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం సడలింపు
- జిల్లాలో ఇప్పటి వరకు 427 దరఖాస్తులు మాత్రమే
- అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది



నంద్యాల మున్సిపల్ కార్యాలయం

నంద్యాల టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరాలు, పట్టణప్రాంతాల్లో నివసించే పేద మధ్య తరగతి ప్రజల కోసం కూటమి ప్రభుత్వం కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 50 చదరపు అడుగులలోపు ఇల్లు కట్టుకునే వారికి రూపాయికే ఇంటి ప్లాన్ అనుమతి ఇవ్వనుంది. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో 50 చదరపు అడుగుల స్థలంలో ఇల్లు కట్టుకోవాలంటే ప్లాన్ కోసం దరఖాస్తు ఫీజు, మొక్కల సంరక్షణ, ఇంకుడు గుంతలు, లేబర్ చార్జీలు.. భరించాల్సి వచ్చేది. దీనికి తోడు అదనంగా కొంత ముట్టజెప్పాల్సి వచ్చేది. ఇవన్నీ కడితేనే ప్లాన్‌కు అనుమతి వస్తుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కడితే అనుమతి ఇచ్చేలా కొత్త నిర్ణయం తీసుకుంది.

నంద్యాల జిల్లాలో నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూర్, ఆళ్లగడ్డ, బేతంచెర్ల, డోన్ వంటి పట్టణాల్లో మున్సిపాలిటీలు ఉన్నాయి. అయితే ఈ కార్యక్రమం గురించి చాలా మందికి తెలియక దరఖాస్తు చేసుకోవడం లేదు. మామూలుగా దరఖాస్తు చేసుకుంటున్నారు. లేదా అనుమతి లేకుండానే ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో కేవలం 427 దరఖాస్తులు మాత్రమే అందినట్లు మున్సిపల్ అధికారులు తెలుపుతున్నారు. వీటిపై వార్డు సచివాలయాలు, గ్రామ సచివాలయాల్లో ప్రజలకు సిబ్బంది అవగాహన కలిగిస్తే దరఖాస్తులు పెరిగే అవకాశం ఉంది.

ప్లాన్ అనుమతులన్నీ లైసెన్స్‌డ్ సాంకేతిక నిపుణులు (ఎల్‌టీపీ) ద్వారా సులభంగా పొందవచ్చు. గృహ నిర్మాణదారులు ఖాళీ స్థలంలో ఫొటోతో పాటు దస్త్రాలు



ఆన్‌లైన్‌లో ఆప్‌లోడ్ చేయాలి. అధికారులు పరిశీలించాక చలానా రూపాయి చెల్లించాలి. స్థల యజమాని ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. చెల్లించిన వెంటనే అనుమతి వచ్చేస్తుంది. ప్రభుత్వం తెచ్చిన ఈ కొత్త నిబంధనల ప్రకారం నంద్యాల జిల్లాల్లో అన్ని మున్సిపాలిటీల్లో కేవలం 327 దరఖాస్తులు వచ్చాయి. దీనికి కొంత మంది సాంకేతిక సమస్యలు ఎదుర్కోవడం వల్ల చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం సడలింపు ఇచ్చింది

భవన నిర్మాణ అనుమతుల్లో ప్రభుత్వం సడలింపు ఇచ్చింది. 50 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు కట్టుకునే వారు ఒక్క రూపాయి చెల్లిస్తే అనుమతి వస్తుంది. నంద్యాల పట్టణంలో జూలై నుంచి ఇప్పటి వరకు 200 వరకు లాగిన్‌కు వచ్చినట్లు తెలిపారు. వీటిలో చాలా వరకు అనుమతులు మంజూరు చేశాం.

- నరసింహమూర్తి,
పట్టణ ప్రణాళిక అధికారి, నంద్యాల జిల్లా

ఆదర్శ భోజనం..!

భారతదేశం విభిన్న సంస్కృతులు, జాతులు, ఆచారాల సమాహారం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆచార వ్యవహారాలు సాగుతుంటాయి. అయితే అక్కడక్కడా వర్గ వైషమ్యాల, కులమతాల తారతమ్యాలు కనిపిస్తూనే ఉన్నాయి. కానీ అందుకు పూర్తి భిన్నంగా ఆదోని మండలంలోని నారాయణపురం ఆదర్శంగా నిలిచింది. కుల, మతాలను పక్కన పెట్టేసి ఊరంతా సమైక్యంగా కలసి భోజనం చేస్తూ ఆదర్శంగా నిలిచారు.


గర్జిలింగేశ్వరుడు సన్నిధిలో భోజనం చేస్తున్న గ్రామస్థులు

- గ్రామస్థులంతా ఒకేచోట సహపంక్తి భోజనం
- నారాయణపురంలో అనాదిగా వస్తున్న ఆచారం
- కుల, మతాలకు అతీతంగా ఏకమై నిర్వహణ
- కార్తీక అమావాస్య మరుసటి సోమవారం రోజు వేడుక



ఆదోని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం అబ్బురపరిచేలా ఇలా ఐక్య భోజనం చేశారు. ఈ గ్రామంలో తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. గ్రామంలోని గర్జలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామస్థులు ఈ ఒక్కరోజు పనులు మానుకుని తెల్లవారుజామునే లేచి అత్యంత నియమ నిష్ఠతో ప్రతిరోజూ చేసుకునే విధంగా భోజనం వండుతారు. ఇంటిల్లిపాదికీ సరిపడా భోజనం సిద్ధమయ్యాక... అదే పాత్రను నేరుగా తీసుకెళ్లి గర్జలింగేశ్వరుడి ఆలయ సన్నిధిలో రాశిగా పోశారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటే అన్ని భోజనం పాత్రలు ఒక్కొక్కరుగా వచ్చి స్వామివారి ఎదుట అలా రాశిలో వేసి నిలబడ్డారు. అన్ని ఇళ్ల నుంచి అన్నం రావడం పూర్తి అవ్వగానే గ్రామపెద్దలు, పూజారులు ఆ భోజనం రాశికి ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, బండారు జల్లారు. పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం ఆవరణలో కలిసి కూర్చున్నారు. రాశిగా పోసిన భోజనాన్ని విస్తరాకుల్లోకి వడ్డించుకుని అందరూ కలిసి ఆరగించారు. ఈ సంప్రదాయం తమ గ్రామాన్ని ఐక్యంగా ఉంచుతోందని ఊరి పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారికి భోజనం నివేదించి, అన్న ప్రసాదాన్ని కలిసి తింటే మేలు జరుగుతుందని ఆ ఊరి జనం విశ్వసిస్తారు.


పూజలందుకున్న గర్జిలింగేశ్వర స్వామి




రాశిగా పోసిన భోజనానికి పూజలు చేస్తున్న అర్చకులు

కుల, మతాలకు అతీతంగా...



కుల మతాలకు అతీతంగా గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని కుటుంబాలకు చెందిన వారు ఒకరోజు వారి ఇంట్లో ఏమి తింటారో అదే దాన్ని ఒకరోజుకు సరిపడా వంటను వండి గుడిలో రాశిగా వేస్తారు. అలా వేసిన భోజనాన్ని గ్రామంలో ఉన్న అన్ని కుటుంబాల వారు అందరూ ఒకోచోట చేరి సహపంక్తి భోజనం చేస్తాం. అలా చేస్తే మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని నమ్మకం. ఈ ఆచారం పెద్దల కాలం నాటి నుంచి వస్తుంది. మేము కూడా అలానే పాటిస్తున్నాం.

\- శేఖర్, మాజీ ఎంపీటీసీ

తరతరాలుగా ఇదే ఆచారం



తరతరలాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. కుల, మతాలకు అతీతంగా, గ్రామస్థులంతా ఒకేచోట చేరి దైవ సన్నిధిలో కలిసిమెలిసి భోజనం చేస్తాం. ఇలా చేస్తే ఊరికి మంచి జరుగుతుందని మా పెద్దలు చెప్పారు. ఒకరోజు ఏ ఇంట్లో ఏ భోజనం వండుకుని తింటారో, దాన్నే తయారు చేసి తీసుకొచ్చి రాశిలో కలుపుతాం. ఆ రాశికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అందరం కలిసి భోజనం చేస్తాం.

\- లింగారెడ్డి, గ్రామపెద్ద

మంచి జరుగుతుందని



గ్రామంలోని ప్రతి ఇంట్లో ఒకరోజు తినే భోజనాన్ని తయారు చేసి గర్జలింగేశ్వరస్వామి సన్నిధిలో ఉంచుతాం. స్వామి సన్నిధిలోనే భోజనం చేస్తే మంచి జరుగుతుందని మా నమ్మకం. తాత ముత్తాల నుంచి వచ్చిన ఆచారాన్ని మేము కూడా పాటిస్తున్నాం.

\- అయ్యప్పరెడ్డి, గ్రామపెద్ద

కరువు దరిచేరదు



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వస్తున్న ఆచారం.. కార్తీక పూజల అనంతరం పెద్ద పండగలా ఈ వేడుకను చేసుకుంటాం. కుల, మతాలకు అతీతంగా ఒకచోటుకు చేరి అన్నం తినడం సంప్రదాయంగా వస్తోంది. ఇలా చేస్తే కరువు దరిచేరదని మా నమ్మకం.

\- రామచంద్రారెడ్డి, గ్రామపెద్ద

నగర పాలక మేనేజర్ చిన్నరాముడుకు అరుదైన గౌరవం

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం



కర్నూలు న్యూసిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడుకు అరుదైన గౌరవం లభించింది. వచ్చే ఏడాది జనవరి 3,4,5, తేదీల్లో గుంటూరులో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు అతిథిగా ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, మహాసభల ప్రధాన సమన్వయకర్త పి.రామచంద్ర అధికారికంగా వెల్లడించారు. చిన్నరాముడు నగర పాలకలో తెలుగు భాషా ప్రచారం, వికాసానికి అంకితభావంతో అందిస్తున్న విశిష్ట సేవలు, రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయని, తెలుగు భాషాభిమానానికి ఆయన చూపుతున్న నిబద్ధత అనేక మందికి స్ఫూర్తిదాయకమని నిర్వాహకులు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుంటూరులో జరిగే మహాసభల కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు ఆంధ్ర సారస్వత సేవా పురస్కారాన్ని అందుకోనున్నారు.

నేటి నుంచి బీఈడీ పరీక్షలు

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బీఈడీ 3వ సెమిస్టర్ రెగ్యులర్/ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 19 పరీక్ష కేంద్రాల్లో బీపీఈడీ, ఎంపీఈడీ, బీఈడీ పరీక్షలకు సంబంధించిన విద్యార్థులు హాల్ టికెట్లతో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు. బీఈడీలో రెగ్యులర్ 3,474 మంది, సప్లిమెంటరీ 471, బీపీఈడీలో రెగ్యులర్ 145, సప్లిమెంటరీలో 21, ఎంపీఈడీలో రెగ్యులర్ 86, సప్లిమెంటరీలో 27 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

మల్లన్న సేవలో సినీ దర్శకుడు సుకుమార్

శ్రీశైలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామివారి గర్భాలయ అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులచే వేదాశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.


అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దర్శకుడు సుకుమార్

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఆకాంక్షించారు. డివిజన్ స్థాయిలో టెన్త్ క్లాస్ సబ్జెక్టులు బోధిస్తున్న సబ్జెక్టు నిపుణులతో సోమ వారం నగరంలోని వర్చువల్ స్టూడియోలో సమన్వయ సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టుకు 12 మంది చొప్పున మొత్తం 84 మంది సబ్జెక్టు నిపుణులకు వర్క్‌షాపు నిర్వహించినట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లా వెనుకబడడానికి ఉపాధ్యాయుల కొరత చాలా ఉండేదని, ఈ విద్యా సంవత్సరంలో మెగా డీఎస్సీ, పదోన్నతుల ద్వారా దాదాపు ఉపాధ్యాయుల కొరత తీరిందని చెప్పారు. పశ్చిమ ప్రాంత మండలాల్లోని విద్యార్థులు వలసలు వెళ్లే పరిస్థితులు ఉన్నాయని, వీటిని అధిగమించడానికి వందరోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను సంసిద్ధులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్, డీసీఈబీ సెక్రటరీ నాగరాజు, పాఠశాల హెచ్ఎంలు మదుసూదన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

హుటాహుటిన తొలగింపు..!


ఆదివారం దాకా ఇలా ఫ్లెక్సీలతో డీఈఓ కార్యాలయం

కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలోన్ని డీఈఓ కార్యాలయానికి ఉన్న రెండు ఫ్లెక్సీలను అధికారులు హుటాహుటిన తొలగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన యూనిఫాంతో ఇద్దరు చిన్నారుల ఫొటోలు, అప్పటి సమాచారంతో ఉన్న ఆ ప్రచార ఫ్లెక్సీలను రెండేళ్లయినా అధికారులు మార్చలేదు. అయితే ఆదివారం దాకా ఉన్న ఆ ఫెక్లీలను సోమవారం మధ్యాహ్నం కార్యాలయ సిబ్బంది హుటాహుటిన తొలగించారు. - కర్నూలు (ఆంధ్రజ్యోతి)


సోమవారం ఉదయం తొలగింపు తర్వాత...

మాక్ అసెంబ్లీ రేపే

- జిల్లా నుంచి ఏడుగురు ఎంపిక
- సమస్యలపై ప్రస్తావించనున్న విద్యార్థులు


మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులతో డీఈవో శామ్యూల్‌పాల్

ఆలూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం అసెంబ్లీ ఆవరణలో పాఠశాల విద్యా శాఖ నిర్వహించే మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొనేందుకు నియోజకవర్గానికి ఒక విద్యార్థి చొప్పున ఒకరిని ఎంపిక చేశారు. మొత్తంగా జిల్లా నుంచి ఏడుగురు మంది విద్యార్థులు మాక్ అసెంబ్లీలో 'అధ్యక్షా' అనేందుకు సిద్ధమయ్యారు. వీరిలో నలుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. స్టూడెంట్ అసెంబ్లీని ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యేలు వీక్షించనున్నారు. అనంతరం విద్యార్థులు అసెంబ్లీ హాలును సందర్శించి సీఎంతో గ్రూపు ఫొటో దిగనున్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు

అసెంబ్లీలో జిల్లా విద్యార్థులు వారి నియోజకవర్గంలోని సమస్యలు ప్రస్తావించేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రొటెం స్పీకర్, ఆపై స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఎలా జరుగుతుంది?, ముఖ్య మంత్రిగా, ప్రతిపక్ష నేతగా జిల్లా విద్యార్థులు ఎంపికైతే ఎలా వ్యవహరించాలి?, జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం, బిల్లులపై చర్చ, వాటి ఆమోదం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంతేగాకుండా అసెంబ్లీ నిర్వహణ సమయంలో మాక్ ఎమ్మెల్యేలు సభను ఎలా నిర్వహించాలి? అన్న విషయాలపై శిక్షణ ఇచ్చారు.

ఎంపికైన విద్యార్థులు వీరే..

ఆలూరు నియోజకవర్గం నుంచి హాలహర్వి జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి పంచగుండెల్ ప్రవీణ్‌కుమార్, ఆదోని నుంచి మున్సిపల్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి గౌతమి, మంత్రాలయం నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సాలె వీరేంద్ర, ఎమ్మిగనూరు నుంచి దైవందిన్నె జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి నవీత్‌కుమార్, పత్తికొండ నుంచి వెల్దుర్తి డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులం 10వ తరగతి విద్యార్థిని చింతమాను గాయత్రి, కోడుమూరు నుంచి సి.బెళగల్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి లోకేశ్వర్‌రెడ్డి, కర్నూలు నుంచి కర్నూలులోని బి.క్యాంపు గర్ల్స్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని సాపోగుల దయానా ఎంపికయ్యారు. అలాగే గోరంట్ల మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి పీజీ సాయి మహీధర్‌ను అదనంగా ఎంపిక చేసినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు.

కిలో రూ.60 పైనే..

- పెరిగిన కూరగాయల ధరలు
- కొనడానికి వెనుకాడుతున్న సామాన్యులు..

డోన్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజోతి): డోన్ మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. మార్కెట్ వెళ్లిన సామాన్యులు కూరగాయల రేట్లు విని బెంబేలెత్తిపోతున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే.. కొనలేము.. తినలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డోన్ కూరగాయల మార్కెట్‌లో టమోటా కిలో రూ.60, పచ్చిమిర్చి కేజీ రూ.60, బీన్స్ కేజీ రూ.100, క్యారెట్ రూ.100, బీట్‌రూట్ రూ.80, బెండకాయ రూ.60, బీరకాయ రూ.60, చిక్కుడు రూ.80, సొరకాయ రూ.60, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.100, దోసకాయ రూ.60, దొండ రూ.60 ప్రకారం ధరలు పలుకుతున్నాయి.

సామాన్యులకు ధరలు అందుబాటులో లేవు



సామాన్యులకు కూరగాయల ధరలు అందుబాటులో లేవు. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయాలన్నా భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ధరలు ఇలాగే కొనసాగితే.. సామాన్యులు, పేదలు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

\- షమీమ్ బేగం, మహిళా సంఘం నాయకురాలు, డోన్

సాగు తగ్గడమే కారణం

డోన్ మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్‌లో కూరగాయల సాగు కొంత తగ్గడం.. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కూరగాయల ధరల పెరుగుదలకు కారణమవుతుంది. నెల రోజుల్లో కూరగాయల సాగు పరిస్థితి చక్కబడే అవకాశం ఉంది.

\- జి.కళ్యాణి, ఉద్యాన శాఖ అధికారి, డోన్



రుద్రవరం మార్కెట్‌లో..

రుద్రవరం: రుద్రవరం మార్కెట్లో సోమవారం కూరగాయలు కిలో ధర రూ.80 పైగానే పలికాయి. ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేయడానికి సుమారు 15 గ్రామాల ప్రజలు తరలివచ్చారు. కాకరకాయ, బెండకాయ, మట్టిక్కాయ, చిక్కుడు, వంకాయ కిలో రూ.80 పలికింది. టమోటా రూ.60 పలికింది. కూరగాయల ధరలు పెరగడానికి మొంథా తుఫానే కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



హైడ్రామా..!

(5వ పేజీ తరువాయి)

నంద్యాల విజయ డెయిరీ పరిధిలోని మాచినేనిపల్లిలో నామినేషన్ ప్రక్రియ నేపథ్యంలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డిని, టీడీపీ యువనేత భూమా విఖ్యాత్ రెడ్డిని గృహనిర్బంధం చేశారు. కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నెలోని మాజీ ఎమ్మెల్యే గృహానికి తెల్లవారుజామునే చేరుకుని హౌస్ అరెస్టు చేశారు. ఆయా గ్రామాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు.

అక్రమ ఎన్నిక చెల్లదు : విఖ్యాత్

ఈ ఎన్నికల తంతు పాల ఉత్పత్తిదారుల కార్యాలయంలో జరగాల్సి ఉండగా కార్యాలయ తలుపులు తెరవకుండానే మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి స్వగ్రామం ఎర్రగుడిదిన్నెలో అక్రమంగా నిర్వహించారు. ఇలాంటి ఎన్నిక చెల్లదు.

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి సహకారం

- రూ. కోటి విరాళం అందజేసిన మంత్రి టీజీ భరత్


ఉర్దూ వర్సిటీ వీసీకి చెక్కును అందజేసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తానని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంత్రి తన చాంబర్‌లో ఉర్దూ వర్సిటీ ఉపకులపతి డా. ప్రొఫెసర్ షావలిఖాన్, రిజిస్ట్రార్ లోక్‌నాథ్‌కు రూ.కోటి చెక్కును విరాళంగా అందజేశారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ సొంత భవనంలో వర్సిటీలో కొనసాగేలా సహకరిస్తామని, భవనం పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఈనెల 11 ప్రకటించిన విధంగా బిల్డింగ్ నిర్మాణానికి విరాళం అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం రిజిస్ట్రార్ లోక్‌నాథ్‌తో కలిసి మంత్రికి పూలబొకే అందించి శాలువాతో సన్మానం చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- బైకు, ఆటో ర్యాలీలను ప్రారంభించిన ఎస్పీ



కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించడం కోసం సోమవారం బైకు, ఆటో ర్యాలీలను కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్, కలెక్టరేట్ మీదుగా సి.క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్లను ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. రద్దీ ప్రాంతాలు, కూడళ్లు, జంక్షన్‌లలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై తనిఖీలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, విక్రమసింహ, తేజామూర్తి, చంద్రబాబు నాయుడు, మధుసూదన్‌రావు, పార్థసారధి, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు, సివిల్, ఏఆర్, ఆయా షోరూంల సిబ్బంది, యువకులు, ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షల్లో 10 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డా వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాల్లో 8,958 మంది దరఖాస్తు చేసుకోగా 8,190 మంది పరీక్ష రాశారని పెర్కొన్నారు.

29న జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11.00 నుంచి 12.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12.00 గంటల నుంచి 1.00 గంటల వరకు 6వ స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో తెలిపారు. అలాగే మధ్యాహ్నం 1.00 నుంచి 2.00 గంటల వరకు 4వ స్థాయి సంఘం, 2.30 గంటల నుంచి 3.30 వరకు 5వ స్థాయి సంఘం, 3.30 నుంచి 5.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి బీమా పరిహారం


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

కర్నూలు రూరల్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త బండ శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. మంగళగిరి తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జనసేన పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకెపోగు రాంబాబు ఆధ్వర్యంలో చెక్కును శ్రీనివాసులు భార్య లలితమ్మకు అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ కార్యకర్త బండ శ్రీనివాసులు ప్యాలకుర్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారని, దీంతో ఆయన కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందించినట్లు ఆయన తెలిపారు.

పత్తి వ్యాపారిపై కేసు.. రూ.30 వేల జరిమానా

కోడుమూరు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):


కాటాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్

మండలంలోని వర్కూరులో లీగల్ మెట్రాలజీ అధికారులు సోమవారం పత్తి కొనుగోలుపై ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాపారిపై కేసు నమోదు చేసి రూ.30 వేలు జరిమానా విధించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్ఎండీ గౌస్ మాట్లాడుతూ వ్యాపారి హెచ్.హనుమంతు వినియోగించే కాటా పది కిలోలకు 1200 గ్రాములు తక్కువగా నమోదైనట్లు గుర్తించామని తెలిపారు. తూకపు కాటాలపై రైతులకు అవగాహన కల్పించారు. తూకపు యంత్రాలకు లీగల్ మెట్రాలజీ ముద్ర తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.

కాల్వలో పడి బాలుడి మృతి

నంద్యాల టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పొన్నాపురం వద్ద ఉన్న కేసీ కాల్వలో పడి బాలుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు. పొన్నాపురానికి చెందిన హరున్‌బాషా, నూరి దంపతుల కుమారుడు ఖాజావలి(18) సోమారం తన స్నేహితులతోపాటు ఈతకు వెళ్లాడు. బాలుడికి ఈత రాకపోవడంతో గట్టున కూర్చున్నాడు. ప్రమాదవశాత్తు కాలి జారి కేసీ కాల్వలో పడిపోయి గల్లంతయ్యాడు. పోలీసులు గాలించి మృతదేహాన్ని సాంబవరం వద్ద బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారు. మృతుడు కూడా వారితో పాటే కూలీ పనులకు వెళ్లేవాడు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో


ప్రమాద స్థలంలో బైక్

చిన్నటేకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హర్షా (18) అనే యువకుడు దుర్మరణం చెందాడు. దిన్నెదేవరపాడు చెందిన బోయ నాయుడు, హర్ష అనే ఇద్దరు స్నేహితులు కలిసి పల్సర్ బైక్‌పై చెట్లమల్లాపురం వెళుతున్నారు. చిన్నటేకూరు ఫ్లైఓవర్ పైన వీరి బైక్ అదుపు తప్పి డీవైడర్‌ను డీ కొట్టింది. బైక్ నడుపుతున్న నాయుడు హెల్మెట్ ధరించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వెనుకాల కూర్చున్న హర్ష వేగంతో కిందపడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉలిందకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ చెందిన రఘు (25) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ నెల 14వ తేదీన రఘు పని ముగించుకొని ఇంటికి తన బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్'కు 65 వినతులు

- కర్నూలు నుంచి అత్యధికంగా 17 అర్జీలు

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్‌కు 65 మంది సమస్యలు తెలిపారని సీఎండీ లోతేటి శివశంకర్ తెలిపారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కర్నూలు నుంచి అత్యధికంగా 17 మంది సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. వినియోగాదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని అయి జిల్లాల ఎస్ఈలను సీఎండీ ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లైన్లుమార్పు, ఫెయిల్ అయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లో-ఓల్టేజీ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికారుల ఇష్టారాజ్యం

- మోదీ సభ పేరుతో వెంచర్‌లో విద్యుత్ లైన్
- ఎస్ఈ దృష్టికి రావడంతో పరిశీలన
- ఏడీఈ, ఏఈల నిర్లక్ష్యంపై మండిపడ్డ కర్నూలు ఎస్ఈ


మోదీసభ ప్రాంతంలోని వెంచర్‌లో విద్యుత్ లైన్


ఎస్ఈ ఆదేశాలతో ఇలా తొలగించారు

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన ప్రధాని మోదీ బహిరంగ సభను సాకుగా చేసుకుని విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సభకు వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో భారీగా విద్యుదీకరణ పనులు చేపట్టారు. అందుకోసం వెయ్యికి పైగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు అంటున్నారు. ఈ సందర్భంగా కర్నూలు డివిజన్ పరిధిలోని ఏడీఈ, ఏఈ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు విమర్శలు వచ్చాయి. అక్టోబరు 16న మీటింగ్ జరిగితే నవంబరు 23 వరకు వెంచర్‌లో విద్యుదీకరణ లైన్లు అలాగే కొనసాగించడం వెనుక అధికారుల లోపాయికారి ఒప్పందం ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వెంచర్‌లో విద్యుత్ లైన్‌ను పరిశీలించిన ఎస్ఈ

అక్టోబరు 16న కర్నూలు జిల్లా నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలోని రాగమయూరి వెంచర్‌లో భారీ బహిరంగసభ నిర్వహించారు. ప్రధాని సభను సాకుగా చూపి ఏకంగా ఓ వెంచర్ యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కై దాదాపు 20 స్తంభాలతో లైన్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో ఆదివారం ఆ వెంచర్‌ను ఎస్ఈ ఆర్. ప్రదీప్ కుమార్, ఎస్ఏఓ చిన్నరాఘవులు, సివిల్ ఏడీఈతో కలిసి పరిశీలించారు. వెంచర్‌లో విద్యుదీకరణ పనులు చేసినట్లు స్పష్టంగా కనిపిస్తుండటంతో కర్నూలు డివిజన్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కర్నూలు రూరల్స్ ఏడీఈ, ఓర్వకల్లు ఏఈలకు మెమో జారీ చేస్తానని ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణమే విద్యుత్ లైన్లు తొలగించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం పనికి రాదని అధికారులపై మండిపడ్డారు.

క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం



మోదీ సభ ప్రాంగణానికి సమీపంలోని ఓ వెంచర్‌లో ఎస్టిమేషన్ లేకుండా విద్యుదీకరణ పనులు చేశారని ఫిర్యాదుతో ఆదివారం ఆ ప్రదేశాన్ని పరిశీలించాను. దాదాపు 40 రోజులు లైన్లు అక్కడే ఉన్నాయి. తక్షణమే విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఏడీఈ, ఓర్వకల్లు ఏఈలను ఆదేశించాం. ఆ ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశించాం. **- ప్రదీప్‌కుమార్, ఎస్ఈ**

ఎట్టకేలకు వెంచర్‌లో విద్యుత్ లైన్లు తొలగింపు

కర్నూలు ఆపరేషన్ ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్ ఆదేశాల మేరకు ఎట్టకేలకు సోమవారం ఆ వెంచర్లో విద్యుత్ లైన్లను అధికారులు తొలగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడీఈ, ఏఈ సిబ్బందితో కలిసి మోదీ సభ ప్రాంతంలో ఉన్న స్తంభాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ అంశంపై స్థానిక అధికారును సంప్రదించగా స్తంభాలు చోరీకి గురవుతాయని వెంచర్లో లైన్ తొలగించలేదని సూచించడం గమనార్హం.

మారిన ఆహారపు అలవాట్లతో అనారోగ్యం

- సిరి ధాన్యాలతో బీపీ, షుగర్‌ని నియంత్రించవచ్చు
- ఆహార, ఆరోగ్య నిపుణుడు ఖాదర్ వలి


మాట్లాడుతున్న డా. ఖాదర్ వలి

కర్నూలు కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మారిన ఆహారపు అలవాట్లు నేడు అనేక అనారోగ్యాలకు కారకాలుగా నిలుస్తున్నాయని ప్రముఖ ఆహార ఆరోగ్య నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. అదితి చిరుధాన్యాలు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన 'చిరుధాన్యాల అవగాహన సదస్సు'కు డాక్టర్ ఖాదర్ వలి ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలులగా భారతీయ ఆహార పంటలు పండించే విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. అయితే ఇవన్నీ ప్రకృతి సహజంగా వస్తున్న మార్పులు కాదని, కృత్రిమంగా కార్పొరేట్ సంస్థల ఒత్తిడుల వల్ల వచ్చినవే అని ఆరోపించారు. పంటల ఉత్పత్తులు పెరిగేందుకు ఎరువులను వాడకం మొదలైందని, ప్రతిఫలంగా వాటి ప్రభావం ఆహార ధాన్యాలపై దుష్పరిణామాలు కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మందులు చల్లిన వరి, గోధుమ వంటి పంటల్ని 16వందల మిలియన్ టన్నుల పండిస్తూ ప్రజలకు అనారోగ్యాన్ని కలిగించేలా చర్యలు జరిగిపోతున్నాయని అన్నారు. వర్షం పడితే పండే పంటలు చిరుధాన్యాలని, నీళ్ల కట్టి పండించే పంటలు వరి, గోధుమలు అని చెప్పారు. ప్రకృతి సహజంగా వర్షాధారంతో పండే పంటలకు, నీటినిలువతో పండించే పంటలకు ఎంతో తేడా ఉంటుందని అన్నారు. ఒకనాడు దేశంలో 240 రకాల చిరుధాన్యాలు పండేవని, నేడు పదికి మించి సిరిధాన్యాలు లభించడం లేదని చెప్పారు. సీ4 గ్రాసెస్ సీడ్‌గా చెప్పుకునే చిరుధాన్యాల్లో ఫైబర్ శాతం ఎక్కువ ఉండి, ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవి తోడ్పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉంటూ చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. మరో అతిథి పారిశ్రామికవేత్త టీజీ శివరాజప్ప మాట్లాడుతూ ఒకప్పుడు చిరుధాన్యాల పంటలకు నిలయంగా జిల్లా ఉండేదని, ఆ పరిస్థితులు తిరిగి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ జిల్లా అధ్యక్షుడు ఐ. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలు పండించేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అదితి చిరుధాన్యాల సంస్థ అధినేతలు సోమశేఖర్ పోగుల, మోహన్‌కుమార్ కడింపల్లి తదితరులు ప్రసంగించారు.

మండలి, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి

- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి

చాగలమర్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని రాయలసీమ రాష్ట్రసమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతికి తన పార్టీ తరఫున లేఖ రాశారు.


మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం చాగలమర్రిలో ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 53 ఆధారంగా ప్రధానమంత్రి సలహా మేరకు రాష్ట్రపతి గవర్నర్లను నియమిస్తున్నారని అన్నారు. గవర్నర్ రాష్ట్రానికి అధిపతి మాత్రమే కానీ ఎటువంటి చట్టబద్ధమైన శాసనసభ విధులను నిర్వర్తించలేరన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్, మంత్రిమండలికి విధుల నిర్వహణలో సలహాలు ఇస్తుంది కానీ ఎటువంటి నిర్ణయం తీసుకునే అధికారం లేదని అన్నారు. గవర్నర్ లేకున్నా రాష్ట్రపరిపాలన సాగుతుందన్నారు. గవర్నర్ అధికారంలో ఉన్నా రాజకీయ పార్టీకి ప్రతినిధిగా వ్యవహరిస్తారని, పక్షపాతంగా ఉంటూ కేంద్రంలోని పాలక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో 1982లో ఎన్టీరామారావు శాసనమండలిని పూర్తిగా రద్దు చేశారన్నారు. 2020లో వైఎస్ జగన్ కూడా శాసనమండలి వ్యవస్థ అనవసరమని భావించి శాసనసభలో 1/3 మెజార్టీతో తీర్మానం చేసి పార్లమెంట్‌కు సమర్పించారన్నారు. అయితే ఇంతవరకు ఆ తీర్మానాన్ని పార్లమెంట్ ఆమోదించలేదన్నారు. శాసనమండలి వ్యవస్థ వల్ల ప్రయోజనం లేదని అన్నారు. రాష్ట్రపతికి, పార్లమెంట్ స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఆర్యవైశ్య నాయకులు రామసుబ్బారావు, రాష్ట్రమైనార్టీ నాయకులు సాదర్‌వలి, జిల్లా మైనార్టీ నాయకుడు ముష్కిన్, యూత్ లీడర్ సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్రేవుల జలాశయం కోసం ఐక్య పోరాటం

- కేపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష


మాట్లాడుతున్న కేపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష

కర్నూలు న్యూసిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు జీవనాడి గుండ్రేవుల ప్రాజెక్టు సాధనంలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఐక్య పోరాటం చేస్తామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. సోమవారం రాజ్‌విహార్ నుంచి ధర్నా చౌక్ వరకు రైతులు, యువత, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద 48 గంటల జల సమర దీక్ష చేపట్టారు. నగరానికి తాగునీరు, పశ్చిమ ప్రాంతంలో రైతులకు సాగునీరు అందించగల శాశ్వత పరిష్కారంగా భావిస్తున్న గుండ్రేవుల ప్రాజెక్టు అత్యవసరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సమితి ఈ దీక్షను నిర్వహిస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ నీటి భద్రత, సాగునీటి స్థిరీకరణ, పరిశ్రమలకు నీటి లభ్యత, వర్షప్రమాద నియంత్రణ అంశాల్లో శాశ్వత మార్పులు, సంభవిస్తాయని, ప్రజలు, యువత, విద్యార్థులు, రైతు సంఘాలు కలిసి చేస్తున్న ఈ ఉద్యమం ప్రాంత భవిష్యత్తు కోసం ప్రజా ఐక్యతకు పెద్ద నిదర్శమన్నారు. సీఎంఎల్పీఎం సెంట్రల్ జనరల్ సెక్రటరీ గఫూర్, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ జి.పుల్లయ్య, ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ మన్సూర్, మాజీ కార్పొరేటర్ పుల్లారెడ్డి, అడ్వకేట్ హేమలత, ఆర్‌వీపీఎస్ నాయకుడు రవి, సంఘీభావం ప్రకటించారు. సీహెచ్ శ్రీనివాసులు, హరినాథ్‌గౌడు, డా.మధు పాల్గొన్నారు.

దేశంపై భక్తి, గౌరవం కలిగి ఉండాలి

- అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామీజీ


ప్రకాశ్‌నగర్‌లోని ఆనంద నిలయంలో మాట్లాడుతున్న పీఠాధిపతి

కర్నూలు కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) ఈ దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ దేశం, ధర్మం, సమాజం పట్ల భక్తి, గౌరవ భావాలు ఉండాలని కడపజిల్లా, బ్రహ్మంగారిమఠం సమీపంలోని తోటపల్లి అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామీజీ ఉద్బోధించారు. సోమవారం నగరంలో సత్సంగ్ పర్యటన కార్యక్రమాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో స్వామీజీ భక్తులతో సమావేశమయ్యారు. నగర శివారులోని గోదా గోకుల క్షేత్రంలో భక్తులకు ఆధ్యాత్మిక బోధన చేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల్లో యువతకు సందేశమిచ్చారు. అనంతరం ప్రకాశ్‌నగర్‌లోని ఆనంద నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రవచన బోధన చేశారు. సి. క్యాంపులోని టీటీడీ కళ్యాణ మంటపంలో గీతా కంఠస్థ పోటీల బ్రోచర్లను విడుదల చేశారు. బాలల్లో, యువతలో నైతిక విలువలు పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. గోకులంలో జరిగిన కార్యక్రమంలో మారం నాగరాజ గుప్త, పల్లెర్ల నాగరాజు, ప్రకాశ్‌నగర్‌లో పసుపుల ప్రకాశ్, ఇందిర, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల్లో డాక్టర్ నాగఫణిశాస్త్రి పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

- 10 బైకులు, స్కార్పియో, రూ.10,380 స్వాధీనం

బనగానపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదాసుపల్లె పరిసర ప్రాంతాల్లో కోడిపందాలు ఆడుతూ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడులు చేసి 10 బైకులు, స్కార్పియో వాహనం, రూ.10,380 నగదు, ఒక పందెం కోడిని స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. కొంత కాలంగా పందెంకోళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో మూకుమ్మడిగా దాడి చేశామన్నారు. అక్కడ సుమారు 40 మంది కోడి పందెంరాయుళ్లు కర్నూలు, నంద్యాల, బేతంచెర్ల మండలం కడప జిల్లాల నుంచి వచ్చి కోడి పందాల బెట్టింగ్ ఆట ఆడుతుండగా దాడి చేశామన్నారు. ఈదాడిలో పలువురు పారిపోగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మాదాసుపల్లెకు చెందిన వడ్డెరామదాసు, బలిజ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఈకోడిపందాల బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వివాదాస్పదంగా నాలెడ్జ్ సెంటర్

- కర్నూలు మెడికల్ కాలేజీలో మళ్లీ రగడ



కర్నూలు హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో నార్త్ అమెరికా కేఎంసీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన నాలెడ్జ్ సెంటర్ అండ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మరోసారి వివాదానికి దారి తీసింది. రూ.50 కోట్ల వ్యయంతో కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్య విజ్ఞానానికి సంబంధించిన నాలెడ్జ్ సెంటర్ భవనం నిర్మించడానికి అల్యూమి అసోసియేషన్ ప్రభుత్వానికి ప్రతిపా దనలు పంపింది. దీంతో పాటు క్రీడల భవనాన్ని నిర్మించాలని కూడా తలపెట్టారు. ఈ మేరకు గత వైసీపీ ప్రభుత్వం 2023 జూన్‌లో అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మెడికల్ కాలేజీ ఆవరణలో నాలెడ్జ్ సెంటర్ ఎక్కడ నిర్మించాలనే అంశంపై వివాదం నెలకొంది. కేఎంసీ మైదానంలోని రోడ్డు వైపు నిర్మించాలని అల్యూమి అసోసియేషన్ తలపెట్టింది. అయితే గ్రౌండ్ ఆటస్థలంలో 60 సెంట్లు కేటాయించడంపై జూనియర్ డాక్టర్లు, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో తాత్కాలికంగా పనులు ఆపేశారు. మళ్లీ ఈ ఏడాది జూలై 28న నాలెడ్జ్ సెంటర్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టగా అప్పుడు ఏపీజీడీఏ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.పి. బ్రహ్మాజీ మాస్టర్‌తో కొందరు ప్రొఫెసర్లు వైద్యులు, జూనియర్ డాక్టర్లతో కలిసి పూర్వ విద్యార్థుల సంఘం నేతలతో గొడవకు దిగారు. నాలెడ్జ్ సెంటర్ పేరుతో 60 సెంట్ల స్థలంలో భవనం నిర్మిస్తే అడ్డుకుంటామని హెచ్చరించడంతో పనులు ఆగిపోయాయి. సెప్టెంబరు 19వ తేదీ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా. పి. చంద్రశేఖర్ మెడికల్ కాలేజీలో నాలెడ్జ్ సెంటర్ భవనం కోసం న్యూలెక్చరర్ గ్యాలరీకి ఎదురుగా ఉన్న స్థలాన్ని, మరో కొన్ని స్థలాలను పరిశీలించి అందరికీ ఆమోదయోగ్యమైన స్థలంలో నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎంసీ అల్యూమి (ఎన్ఆర్ఐ) సంఘం నిర్మించతలపెట్టిన నాలెడ్జ్ సెంటర్ అంశం తెరమీదకు వచ్చింది. సంఘం రూ.50 కోట్లతో ఖర్చు చేసేందుకు ముందుకు వస్తే ఎందుకు అభ్యంతరం చెబుతున్నారో అర్థం కావడం లేదని మంత్రి వ్యాఖ్యానించారు. నాలెడ్జ్ సెంటర్‌కు 60 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని, దీన్ని కట్టకుండా అభ్యంతరాలు చెబుతున్న జూనియర్ డాక్టర్లు, ఏపీజీడీఏ వైద్యుల సంఘం నేతలతో మాట్లాడుతానని అన్నారు. పరిపాలనపరంగా తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తామని ప్రిన్సిపాల్ మంత్రికి వివరించారు. ఆ తర్వాత కొందరు జూనియర్ డాక్టర్లతో మంత్రి మాట్లాడారు. ఏపీజీడీఏ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా. బ్రహ్మాజీ మాస్టర్ సమావేశానికి వస్తుండగా.. మంత్రి వెళ్లడంతో వెనుదిరిగారు. ఎట్టి పరిస్థితుల్లో నాలెడ్జ్ సెంటర్‌ను కేఎంసీ గ్రౌండ్స్‌లో నిర్మించేందుకు అనుమతించమని డా. బ్రహ్మాజీ మాస్టర్ తేల్చి చెప్పారు. ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మహానందిలో వసతి గదుల నిర్మాణానికి విరాళం



దాతకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో

మహానంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహా నంది క్షేత్రంలో భక్తుల వసతి కోసం దేవస్థానం నిర్మిస్తున్న వసతి గృహాలకు ఎన్నారై కుటుంబం రూ.1.25 కోట్లు విరాళంగా ఇచ్చినట్లు ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఎన్నారై కుటుంబానికి చెందిన వడ్లమూడి సరోజిని ఆమె భర్త వడ్లమూడి రమేష్ బాబు(యుఎస్‌ఏ) ఒప్పంద పత్రాలను హైదరాబాద్‌లోని దాత స్వగృ హంలో ఈవో, అధికారులు స్వీకరించారు. క్షేత్రంలో నందీశ్వర సదనం మొదటి అంతస్థు నిర్మాణంలో భాగంగా దాత విరాళ పత్రాలను అంద చేసినట్లు ఈవో చెప్పారు. దాతకు స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏఈవో మధు, సీనియర్ అసిస్టెంట్ జగదీశ్వరరెడ్డి, వేదపండితులు,అర్చకులు పాల్గొన్నారు.

మహానందిలో పల్లకీ సేవ

మహానంది, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ సేవను భక్తుల సమక్షంలో ఆలయ వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కల్యాణ మంటపంలో ప్రత్యేక పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజలు జరిపారు. మేళతాళాలతో ఆలయ ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు.

ఉపాధి పనులపై విచారణ

బండిఆత్మకూరు నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులపై విచారణ చేపట్టినట్లు పరిశీలకులు పవన్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని భోజనం, ఎర్రగుంట్ల గ్రామాల్లో 19వ విడత ఉపాధి పనులపై గ్రామ సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనులపై మూడు రోజులపాటు విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఎవరైనా అభ్యంతరాలు, అవకతవ కలు ఉన్నా సామాజిక తనిఖీ సభ్యులకు నేరుగా గాని, రాత పూర్వకంగా గాని తెలియజేయాలని సూచించారు. డీఆర్పీలు పెద్దయ్య, సురేష్, డీవైఎం డీవో పురుషోత్తం, పీఆర్ ఏఈ వెంకటరా ముడు, ఏపీవో వసుధ, కార్యదర్శులు ఆయేషా, చంద్రనాయక్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు నరసింహారెడ్డి

నందికొట్కూరు, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): స్వాతం త్ర్యం కోసం బ్రిటీష్ వారితో పోరాడి ప్రాణాలు కోల్పోయిన యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. సోమవారం నరసింహారెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలోని కొత్తబస్టాండ్ సమీపంలోని ఆయన విగ్ర హానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పోరాట తత్వాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నందికొట్కూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 1వ అంగన్‌వాడీ కేంద్రాన్ని, పశువైద్య ఉపకేంద్రాన్ని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య తనిఖీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లల వివరాలు రిజిస్టర్ నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలు ఎంత మంది ఉన్నారు, రోజు వస్తున్నారా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పశువైద్య ఉపకేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి సన్మానం

మిడుతూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో చౌట్కూరు గ్రామానికి చెందిన రాజకుమారి బంగారు పతకాన్ని సాధించింది. సోమవారం నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య క్రీడాకారిణిని సన్మానించారు. మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నరసింహగౌడు, రవణమ్మ, అబ్దుల్లా, శబుబాషా, మహేష్ పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

ఆత్మకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పిల్లలు ఆత్మస్థైరంతో ముందుకెళ్లాలని నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రేమంత్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన దివ్యాంగ పిల్లలకు సహాయ ఉపకరణాల పంపిణీకి సంబంధించి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సహాయ సమన్వయకర్త శ్రీనివాసులు, ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు ఎంఈవోలు మార్గరేట్, అయూబ్ అహ్మద్, నాగరాజు, బాలాజీనాయక్ తదితరులున్నారు.

నేటి నుంచి షష్ఠి మహోత్సవాలు

శ్రీశైలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరునికి షష్ఠి మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. సోమవారం ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ మాట్లాడుతూ పంచమి తిథి సందర్భంగా మూలవిరాట్టుకు ఏకాదశ పంచామృత, ఫలోదక అభిషేకాలు, పుష్పార్చనలు, నివేదన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

1నుంచి దీక్ష విరమణ

శ్రీశైలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పరమశివుడికి ప్రతికరమైన కార్తీక మాసంలో భక్తులు నియమనిష్ఠలతో మాసాంతం మండల, అర్ధమండల దీక్షలు విరమించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వచ్చేనెల 1 నుంచి 5వరకు శివదీక్షా శిబిరాల వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాలలో మాలధారులు దీక్షా విరమణ చేసుకోవాలని సూచించారు.

జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ఆత్మకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 విభాగం సైక్లింగ్ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని పీ.మౌలాబీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుంకన్న తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి మౌలాబీ ఎంపికైనట్లు తెలిపారు. అలాగే బాక్సింగ్ అండర్-17 విభాగంలో జయశంకర్ అనే విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు అభినందించారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

ఆత్మకూరురూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, అలాగే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ కోరారు. సోమవారం బాపనంతాపురం గ్రామంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని రైతు సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి వీరన్న, కౌలు రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జేఏసీ నాయకులు కోరారు. సోమవారం మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు కాంతారావు, ఉపాధ్యక్షుడు ఆదిశేషయ్య, జేఏసీ నాయకులు శేఖర్, పుల్లారెడ్డి, అస్మద్దీన్ పాల్గొన్నారు.

27న సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

నంద్యాల కల్చరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్టోరియా రీడింగ్ రూమ్‌లో ఈనెల 27న గురువారం రాత్రి 9గంటలకు సత్యహరిశ్చంద్ర పూర్తి నాటకం ప్రదర్శించనున్నట్లు ఆర్గనైజర్ రామాంజనేయులు తెలిపారు. కళాకారులు, కళాపోషకులు, సాహిత్యాభిలాషులు, ప్రజలు పాల్గొని నాటకాన్ని ఆదరించాలని కోరారు.

రైతుల జీవితంలో వెలుగు గీతికలు

పంచసూత్రాలు

- త్వరలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ఉల్లి రైతులకూ పరిహారం
- ఎమ్మెల్యే గిత్తా జయసూర్య
- జిల్లా వ్యాప్తంగా 'రైతన్న మీకోసం'ప్రారంభం



నందికొట్కూరులో రైతన్న మీకోసం కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే, వ్యవసాయశాఖ అధికారులు

నందికొట్కూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సాంప్రదాయ వ్యవసాయం నుంచి అధునాతన పద్ధతుల వైపు రైతులను నడిపించేందుకు పంచసూత్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చారని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలోని కోటావీధి, కురువపేట, 21వ వార్డులలో రైతన్న మీకోసం, రైతన్న సేవలో...మన మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేసిన మేలు, చేయబోతున్న పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం వ్యవసాయ రీసర్చ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రానున్న 5 సంవత్సరాల్లో రైతును రాజు చేసేందుకు వ్యవసాయంలో పంచసూత్రాలను పరిచయం చేస్తున్నారన్నారు. కాస్త ఆలస్యమైన ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరలోనే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందన్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని ఉల్లి రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించేందుకు వ్యవసాయశాఖామంత్రి అచ్చెన్నాయుడు సుముఖంగా ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ వీరం ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్లు చిన్నరాజు, ధర్మారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జీలు మద్దిలేటి, జాకీర్ టీడీపీ నాయకులు, వ్యవసాయ శాఖ ఏడీఏ గిరీష్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, అధికారులు పాల్గొన్నారు.

పాములపాడు : మండలంలోని మద్దూరులో రైతులు , అధికారులతో కలిసి టీడీపీ రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు తిమ్మారెడ్డి రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ వెంకటశివుడు, వీఆర్వో శ్రీనివాసులు, సొసైటీ సీఈవో ముర్తుజావలి, రైతులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని భోజనం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ఏవో పవన్‌కుమార్, తహసీల్దారు పద్మావతమ్మ ప్రారంభించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి, పశువైద్యాధికారి అనూష, వ్యవసాయ, రెవెన్యూ హార్టికల్చర్, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పగిడ్యాల: మండంలోని నెహ్రూనగర్, ముచ్చుమర్రి గ్రామాల్లో ఏవో మురళీధర్ ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం నిర్వహించారు. రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు , సిబ్బంది, రైతులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలో సహకార సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఏవో కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతన్న- మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలో 'రైతన్న మీ కోసం'ను ఏవో స్వప్నిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ నెల 29వరకు అన్ని గ్రామాల్లో వివరాలు సేకరిస్తామన్నారు. డిసెంబరు 3న గ్రామసభలు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మొహిద్దీన్, హార్టికల్చర్ ఆఫీసర్ ధరణి, వెటర్నరీ డాక్టర్ ఉమాదేవి పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని తహసీల్దార్ వెంకటరమణ, మండల వ్యవసాయాధికారి పవన్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం కార్యక్రమాన్ని మండలంలో తహసీల్దారు ఉమారాణి, మండల వ్యవసాయాధికారి అమీరున్నిసా బేగం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాగంపల్లి సొసైటీ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, ఏఈవోలు శ్రీనివాసులు, నాగశ్రీ, సెరికల్చర్ అధికారిణి నాగశ్రీ, రైతు సేవా కేంద్రం జావీద్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.



గడివేములలో..



బండిఆత్మకూరులో ..



జూపాడుబంగ్లా మండలం తంగడంచలో..



పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌లో..

కూటమి ప్రభుత్వంలోనే అన్నదాతలకు భరోసా

- శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి
- బాపనంతాపురం గ్రామంలో 'రైతన్న మీకోసం'



బాపనంతాపురంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వంలోనే అన్నదాతలకు భరోసా లభిస్తుందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని బాపనంతాపురం గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా రైతుల కుటుంబాలను సందర్శించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం అమలు గురించి ఆరా తీశారు. మొక్కజొన్న దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో నాగేంద్రుడు, మండల వ్యవసాయాధికారిణి హేమలత, ఉద్యానశాఖ అధికారి చందన, నాయకులు రవీంద్రబాబు, శివప్రసాద్‌రెడ్డి, షాబుద్దీన్, కలిముల్లా, మల్లికార్జునరెడ్డి, గిరిరాజు, అబ్దుల్లాపురం బాషా, శివశంకర్, శివప్రసాద్ తదితరులున్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజల్లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై సరైన అవగాహన కల్పిస్తేనే ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చడం సాధ్యమవుతుందని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్‌ఐవీ, ఎయిడ్స్ చట్టం-2017, తల్లి-బిడ్డ రక్షణపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్‌ను జాయింట్ కలెక్టర్ కార్తీక్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ బాధితులపై వివక్ష లేకుండా సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడం, తల్లిలో నుంచి శిశువుకు హెచ్‌ఐవీ సంక్రమణను నివారించేందుకు ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు ఉన్నారు.

సైనికుల సంక్షేమ నిధికి సహకరించండి

దేశవ్యాప్తంగా డిసెంబరు 7న నిర్వహించనున్న సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా సైనికుల సంక్షేమ నిధికి ప్రజలు ఉదారంగా చేయూత అందించాలని కలెక్టర్ రాజకుమారి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఫ్లాగ్ డే పోస్టర్‌ను కలెక్టర్, జేసీ, సైనిక సంక్షేమ అధికారి ఆవిష్కరించారు. ప్రతి పౌరుడు తమ వంతు సహాయం అందించాలని కలెక్టర్ సూచించారు.

అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు



మాట్లాడుతున్న ఈఆర్వో ప్రేమంత్ కుమార్

ఆత్మకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీశైల నియోజకవర్గం పరిధిలో అదనంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ ప్రేమంత్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటివరకు 226 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్న ఉండటంతో అదనంగా ఎనిమిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రత్యేకించి అమలాపురం 32, కురుకుంద 40, ఆత్మకూరు పట్టణంలోని మార్కెట్ యార్డు 50, ప్రభుత్వ ఉన్నత పాఠశాల 55, రహమత్ నగర్ 69, నీలితొట్లవీధి 77, వెలుగోడులోని 143 పోలింగ్ కేంద్రాలు అధికంగా ఉండటంతో విభజించినట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కింద 2002 ఓటరు జాబితాను అనుసంధానించే ప్రక్రియ 70శాతం పూర్తయినట్లు వివరించారు. సమావేశంలో తహసీల్దారు రత్నరాధిక, ఎన్నికల విభాగం డిప్యూటీతహసీల్దార్ రవణమ్మ, ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

శ్రీశైలంలో ప్రత్యేక పూజలు

- పంచమఠాలలో పురాతన శివలింగాలకు పూజలు
- స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ



ఆదిదంపతులకు పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీశైలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలక్షేత్రంలో ప్రధాన దేవాలయానికి ఉపాలయాలుగా ఉండే ఘంటామఠం, భీమశంకర మఠం, విభూతిమఠం, రుద్రాక్షమఠం, సారంగధార పంచమఠాలలో కొలువైఉన్న పురాతన శివలింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్లకు అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం ప్రధాన ఆలయంలో ఉన్న పురాతన రాతి మండపంలో స్వామిఅమ్మవార్లకు ఊయలతో ఆశీనులచేసి షోడశోపచార పూజలు నిర్వహించారు. అలాగే సహస్ర దీపార్చన నివేదించి భక్తులకు దర్శనాలు కల్పించారు.

శ్రీశైల దేవస్థానానికి విరాళాలు

శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న వివిధ పథకాలకు భక్తులు విరాళాలు సమర్పించారు. సోమవారం నిత్యాన్నదాన ప్రసాద వితరణ పథకానికి చిత్తూరుకు చెందిన హేమా చలపతిరెడ్డి రూ. లక్ష నూట పదహారు విరాళంగా ఇచ్చారు. అదేవిధంగా గో సంరక్షణానిధికి కర్నూలుకు చెందిన భైరెడ్డి సుభాష్ రెడ్డి దంపతులు రూ. లక్ష విరాళాన్ని ఆలయ పర్యవేక్షకులు అయ్యన్నకు అందజేశారు. దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేక దర్శనంతో పాటు లడ్డూ ప్రసాదాలు, పరిమళ విభూది, శేషవస్త్రాలు, జ్ఞాపికను అందజేశారు.

జీజీహెచ్‌లో సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం నాయకుల డిమాండ్
- ఆస్పత్రి ఎదుట నిరసన

నంద్యాల హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లా అయిన తర్వాత అన్ని ప్రాంతాలనుంచి వేలాదిసంఖ్యలో రోగులు జీజీహెచ్‌కు వస్తున్నారని, సరిపడే ఓపీ కౌంటర్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుండెజబ్బులకు చికిత్స లేక, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేక రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్డియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని, ఆస్పత్రిలో అన్ని రకాల మందులు సరఫరా చేయాలని, జనరిక్ మందుల షాప్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రం ఇచ్చేందుకు సూపరింటెండెంట్ లేకపోవడంతో ఆర్ఎంఓ వెంకటేశ్వర్లు దగ్గరకు వెళ్లగా నిరాకరించారని , మంత్రి ఫరూక్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, ఏసురత్నం, పుల్లానరసింహులు, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, మౌలాలి, సత్యం, కేశాలు పాల్గొన్నారు.

ఎస్సీల రిజర్వేషన్‌ను 30 శాతానికి పెంచాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ

నంద్యాల నూనెపల్లి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు 15 శాతం నుంచి 30 శాతానికి పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భం గా వీరయ్య మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడికి పాల్పడిన నిందితుడు న్యాయవాది రాకేశ్ కిశోర్‌పై ఢిల్లీ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని నిందితులకు 41సీఆర్పీ రద్దు చేయాలన్నారు. దళితులకు ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ ల్యాండ్ సీలింగ్ ఇతర లీజు భూములు అన్యాక్రాంతం అయిన చోట రాష్ట్ర ప్రభుత్వం పట్టాదారులకు భూములను స్వాధీనం చేయాలని కోరారు. అనం తరం పలు డిమాండ్ల సాధనపై కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పూలరాజు మాదిగ, ఎం కృష్ణ మాదిగ, లక్ష్మయ్య మాదిగ, రాధమ్మ, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్ నంద్యాల



పతకాలు సాధించిన క్రీడాకారులతో ముఖ్య అతిథులు

నంద్యాల హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్పై్కమార్షల్ ఆర్ట్స్ పోటీల్లో నంద్యాల జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించినట్లు స్పై్క మార్షల్ జిల్లా కార్యదర్శి నూర్‌బాషా తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ షాదీఖానా భవనంలో ఈ నెల 23న జరిగిన స్పై్క మార్షల్ చాంపియన్‌షిప్ పోటీల్లో 14జిల్లాల నుంచి దాదాపు 300మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సోమవారం బహుమతుల ప్రదానోత్సవంలో రాష్ట్ర స్పై్క మార్షల్ సంఘం చైర్మన్ ఇస్మాయిల్, కార్యదర్శి ఇబ్రహీం, జిల్లా అధ్యక్షుడు సోమశేఖరరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పలు కేటగిరీల్లో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. జనవరి 5నుంచి 7వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే జాతీయ స్పై్క మార్షల్ పోటీల్లో విజేతలు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాయల్ గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ డా.వి.యాకూబ్, కరస్పాండెంట్ ఇసాక్, ఖాదర్‌వలి, నబిసాహెబ్, ఈశ్వర్, మన్సూర్, అబ్దుల్లా, విశ్వ, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు పీఈటీ ఎంపిక



పీఈటీ హమీదాబేగంను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాణ్యం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి పోటీలకు మద్దూరు జడ్పీహైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయురాలు హమీదాబేగం ఎంపికైనట్లు హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 21న విజయవాడలోని ఐజీఎం స్టేడియంలో జరిగిన ఆలిండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పీఈటీ ఎం. హమీదాబేగం ప్రతిభ కనబర్చారన్నారు. త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఉపాధ్యాయురాలు పాల్గొంటారన్నారు. పీఈటీని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు అభినందించారు.

28న ఉద్యోగ మేళా

నంద్యాల, నూనెపల్లి 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జ్ఞానపురం నేషనల్ ఐటీఐ కళాశాలలో ఈ నెల 28న ఉద్యోగమేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కల్యాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా, ఏదైనా డిగ్రీ, ఇంటర్, పదవ తరగతి పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు విద్యార్హతలకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఫొటోస్ తీసుకొని హాజరుకావాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌సీఎస్.గవర్నమెంట్. ఇన్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు.

వచ్చేనెల 13న లోక్ అదాలత్

ఆత్మకూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టులో వచ్చేనెల 13న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి సీనియర్ సివిల్ న్యాయాదికారి శోభారాణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ త్వరితగతిన కేసులను పరిష్కరించాలనే ఉద్దేశంతో మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామన్నారు. పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులకు సరైన మార్గనిర్దేశం చేసి లోక్ అదాలత్‌ను వినియోగించుకునేలా చొరవ తీసుకోవాలని ఆమె సూచించారు.

హెల్మెట్ తప్పనిసరి: సీఐ



పాములపాడు బస్టాండు కూడలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

పాములపాడు, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పాములపాడు బస్టాండు కూడలిలో వాహన చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు, సెల్‌ఫోనులు ఇవ్వరాదని, సూ చించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

నరసింహారెడ్డి సేవలు చిరస్మరణీయం



నివాళి అర్పిస్తున్న సేవా సమితి సభ్యులు

ఉయ్యాలవాడ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తొలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు గోవిందరెడ్డి అన్నారు. నరసింహారెడ్డి జయంతి సందర్భంగా ఉయ్యాలవాడ బస్టాండ్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రామస్థులు సుబ్బయ్య, రామానాయుడు, ప్రసాదు, వేణు, రామక్రిష్ణారెడ్డి, ఉశేనయ్య పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న దాతలు

చాగలమర్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర ఆలయాల అభివృద్ధికి విరాళాలు అందించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. సోమవారం పీరయ్య, ఉసేనమ్మ దంపతులు రూ.20వేలు, సంజీవరాయుడు, లక్ష్మమ్మ రూ.21వేలు, శ్రీమణ్యం ఆగ్రో ఏజెన్సీ వారు రూ.50 వేలు నగదును అందజేశారని తెలిపారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొలిమిగుండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకిరెడ్డిపల్లె, కనకాద్రిపల్లె సబ్ స్టేషన్ల పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ఇన్‌చార్జి ఏఈ లక్ష్మణస్వామి సోమవారం తెలిపారు. అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలోకి భారీ వాహనాలు రానున్న నేపథ్యంలో అంకిరెడ్డిపల్లె పరిధిలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు.. కనకాద్రిపల్లె పరిధిలో 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలి పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ

బనగానపల్లె. నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటిలో వెలసిన ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల పల్లకీ సేవను సోమవారం నిర్వహించారు. అర్చకులు ప్రదోషకాల ప్రత్యేక పూజల అనంతరం స్వామి, అమ్మవార్లను మండపం వద్దకు తీసుకొచ్చి పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పాండురంగారెడ్డి, మౌళీశ్వరరెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేష్‌రెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మప్రచారం అందరి బాధ్యత

చాగలమర్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ధర్మప్రచారం అందరి బాధ్యతని ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి అన్నారు. మండలంలోని కొత్తపల్లె గ్రామంలో హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూధర్మం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. భైరవీశ్వర ఆలయ నిర్వాహ కుడు మునయ్యస్వామి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లాప్రచారక్ చంద్రశేఖర్, సంయోజిత మండల కన్వీనర్ లక్ష్మీదేవి, హిందూ ఐక్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

బేతంచెర్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శేషారెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రంలో తవిసికొండ గ్రామానికి చెందిన సురా మద్దిలేటి రెడ్డి, సురా సునీత దంపతుల సహకారంతో గర్భిణులకు, రోగుల బంధువులకు లయన్స్ క్లబ్ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురా మధు సుధాకర్‌రెడ్డి, వలిబాషా, రవికుమార్, కేశాల్ నాయుడు, వన్నూరు సాహేబ్, రామకృష్ణ, కమల్‌బాషా పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

సంజామల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సౌమిత్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో సాల్మాన్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని ముదిగేడు సచివాలయంలో సౌమిత్వ సర్వేపై సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. భూములను రీ సర్వే చేసి యజమానులను గుర్తించినట్లుగానే గ్రామంలోని ఇంటింటిని సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈవోపీఆర్డీ రాధికారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి: సీపీఐ

కొలిమిగుండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. సోమవారం పేదలందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలంటూ కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి ధర్నా చేశారు. అర్హులైన వారి దరఖాస్తులను తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో దస్తగిరిబాబుకు అందజేశారు. రైతు సంఘం నాయకులు పుల్లయ్య, సూర్యనారాయణ, మహేష్, ఆటో యూనియన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందన

ఆళ్లగడ్డ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ వైపీపీ ప్రభుత్వ పాఠశాలకు చెందిన హేమంత్ నాయక్ సౌత్ జోన్ పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు డీఎస్పీ ప్రమోద్ సోమవారం అభినందించారు. ఇటీవల జరిగిన సౌత్ జోన్ క్రికెట్‌పోటీల్లో 9 వికెట్లు తీశాడు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన క్రీడాకారుడికి డీఎస్పీ ప్రమోద్, సీఐ యుగంధర్‌లు జ్ఞాపికను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కోచ్ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పొదుపు పుస్తకాలు సక్రమంగా నమోదు చేయాలి



మాట్లాడుతున్న గోపాల్

రుద్రవరం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పొదుపు పుస్తకాలు సక్రమంగా నమోదు చేయాలని ఏరియా కో-ఆర్డినేటరు గోపాల్ అన్నారు. రుద్రవరంలోని వెలుగు కార్యాలయంలో వీవోఏలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రుద్రమదేవి మండల సమాఖ్య సంఘం అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఏపీ వసంతకుమారి పాల్గొన్నారు.

'స్వామిత్వ'తో స్వాహా

- సర్వే పేరుతో పంచాయతీ సిబ్బంది చేతివాటం
- ఆస్థుల ఆన్‌లైన్ అంటూ అక్రమాలకు తెర
- ప్రజల జేబులు చిల్లు



పేట్నికోట గ్రామ సచివాలయం

కొలిమిగుండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలన్న లక్ష్యంతో నిర్వహిస్తున్న 'స్వామిత్వ'తో కొందరు స్వాహా పర్వానికి తెర లేపారు. సర్వే పేరుతో పంచాయతీ కార్యదర్శులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. సర్వేను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాల్లో స్వామిత్వ సర్వే పేరు చెప్పి ప్రజల నుంచి పంచాయతీ అధికారులు డబ్బులు స్వాహా చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి స్వామిత్వ సర్వే గ్రామ కంఠంలో ఉన్న ప్రజల ఆస్థులపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, సర్వే ద్వారా కొలతలు వేసి గుర్తించాలి. వీటిపై అభ్యంత రాలను తెలుసుకొని అనంతరం ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఈప్రక్రియ మొత్తం పూర్తిగా ఉచితంగా నిర్వహించాలి. కొందరు పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సర్వే పేరుతో చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. ఇంటి స్థలాలు కొలతలు వేశాం. ఇంటి పన్నుతో పాటు, అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో పొందు పరచాలంటే పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందని బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు. పరిస్థితిని, ఇంటి స్థాయిని బట్టి రూ.2000 నుంచి రూ.25,000వేలకు పైగా వసూలు చేస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇవ్వకుంటే మీ ఆస్థులను ఆన్‌లైన్ చేయడానికి వీలు పడదని, మీ ఆస్థులపై వివాదాలు ఉన్నట్లు గుర్తిస్తామని బెదిరిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలోని అంకిరెడ్డిపల్లె, పేట్నికోట, కొలిమిగుండ్ల గ్రామాల్లో ఈతతంగం బహిరంగంగా జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికార పార్టీ నాయకులను సైతం పంచాయతీ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తుండటం గమనార్హం.

ఓ లబ్ధిదారుడిని ఇంటి పన్ను..

మండలంలోని అంకిరెడ్డిపల్లె గ్రామంలో ఓ లబ్ధిదారుడిని ఇంటి పన్ను పేరుతో రూ.10వేలు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనంటూ సదరు లబ్ధిదారుడు స్థానిక టీడీపీ నాయ కుడిని ఆశ్రయించారు. టీడీపీ నాయకుడు చెప్పినా సదరు అధికారి ఏమాత్రం తగ్గలేదు. మాకు ఖర్చులుంటాయన్న, మీరు చెబుతున్నారు కదా రూ.5వేలు ఇప్పించండి అంటూ ఆ అధికారి సమాధానమివ్వడం గమనార్హం. సామాన్య, మధ్య తరగతి ప్రజలు కష్టాలు పడుతూ అడిగిన డబ్బులు చెల్లిస్తున్నారు. ఓ పంచాయతీ అధికారి గతంలో ఇలాగే తప్పులు చేసి సస్పెండ్ అయ్యారు. ఇప్పటికైనా కొలిమిగుండ్ల మండలంలో పంచాయతీ అధికారుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ జరిపి చర్యలు తీసుకుంటా



స్వామిత్వ సర్వే పూర్తిగా ఉచితం. ప్రజలు డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇంటి పన్ను, స్వామిత్వ పేరుతో పెద్దమొత్తంలో డబ్బు వసూలు చేస్తున్న పంచాయతీ అధికారులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

- దస్తగిరిబాబు, ఎంపీడీవో, కొలిమిగుండ్ల

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

టీడీపీ నాయకుడు కోట్ల రాఘవేంద్ర రెడ్డి



మాట్లాడుతున్న కోట్ల రాఘవేంద్ర రెడ్డి

డోన్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి బూత్, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ కన్వీనర్లు సిద్ధం కావాలని టీడీపీ నాయకుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో బూత్, క్లస్టర్ కన్వీనర్ల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ బూత్, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ కన్వీనర్‌లు క్రమశిక్షణతో పని చేస్తే డోన్ నియోజకవర్గంలో టీడీపీ స్పష్టమైన విజయం సాధించడం ఖాయమన్నారు. అలాగే విభిన్న నియోజకవర్గాల నుంచి వచ్చిన అబ్జర్వర్లు కార్యక్రమంలో పాల్గొని బూత్‌ల పనితీరును సమీక్షించారు. పార్టీ విభాగాల ప్రకారం ప్రతి 5 బూత్‌లకు ఒక అబ్జర్వర్‌ను నియమించే వ్యవస్థ కొనసాగుతోందని డోన్ నియోజకవర్గ అబ్జర్వర్ కేసీ హరి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఫణిరాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, నియోజకవర్గ అబ్జర్వర్ కేసీ హరి, రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణరెడ్డి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.చిన్న వెంకటస్వామి, ఏపీ యాదవ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సభ్యులు కే.వెంకటేశ్వర్లు యాదవ్, ఉలిందకొండ పీఏసీఎస్ చైర్మన్ ఈవీ రమణ, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సభ్యులు బోయ మహేష్ నాయుడు, కల్లూరు పీఏసీఎస్ చైర్మన్ డి.శేఖర్, పీఏసీఎస్ పగిడ్యాల చైర్మన్ డి.దామోదర్ రెడ్డి, పీఆర్ సాబ్‌పేట పీఏసీఎస్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరెడ్డి, మద్దూరు పీఏసీఎస్ చైర్మన్ కే.జనార్దన్ రెడ్డి, నంద్యాల ఏఎంసీ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, రాష్ట్ర కార్యదర్శి చల్లా భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

దుకాణాల్లో చోరీ

చాగలమర్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల సమీపంలో కూలూరు రహదారిలోని రెండు చిల్లర దుకాణాల్లో గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. రమణయ్యకు చెందిన దుకాణంలో రూ.5వేలు విలువ చేసే సిగరేట్లు, రూ.4వేల నగదును దుండగులు చోరీ చేశారని, పక్కనే ఉన్న గోవిందమ్మ దుకాణంలో తాళాలు పగలగొట్టి విలువైన వస్తువులు లేకపోవడంతో వదిలేసి వెళ్లారు. బాధితులు ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్‌లో ఇంటి పన్నుల చెల్లింపు

చాగలమర్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విధానం అమలులోకి వచ్చిందని ఈవో తారకేశ్వరి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ చాగలమర్రి గ్రామ పంచాయ తీలో ఇళ్లసమాచార ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. అన్ని పంచాయ తీల్లో ఇళ్ల సమగ్ర సమాచారంతో ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైందని అన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి

ప్యాపిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వెంకట్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి విధుల్లోకి చేరిన ఉపాధ్యాయులకు మళ్లీ టెట్ పరీక్షలు నిర్వహించడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు చిన్నపురెడ్డి, చంద్రమౌళి, కిరణ్ కుమార్, పవిత్రన్‌రావు పాల్గొన్నారు.

వసుధా ఫౌండేషన్ సేవలు ఎనలేనివి

బనగానపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వసుధా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మంతెన వెంకటరామరాజు సేవలు ఎనలేనివని టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శీనయ్య అన్నారు. సోమవారం టంగుటూరు శీనయ్య కార్యాలయం ఆవరణలో నలుగురు పేద రోగులకు రూ.24 వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, నాగరాజు, శరత్‌బాబు పాల్గొన్నారు.

కార్మికుడి మృతి

డోన్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొండపేట చాకిరేవుమెట్ట ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎస్.హసన్ (48) గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ఎల్లయ్య, పట్టణ కార్యదర్శి టి.శివరాం, బేతంచెర్ల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే బాషా, ఉపాధ్యక్షుడు మాసూం వలి, సహాయ కార్యదర్శి నమోసా వలి, కమిటీ సభ్యులు రజాక్, ఖాదర్, డోన్ నాయకులు ఫక్రుద్దీన్, మాబాషా, లక్ష్మన్, అప్సర్‌బాషా, నూరిలు మృతుడి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వ్యక్తిపై దాడి

ప్యాపిలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలచట్ల గ్రామంలో పొలం విషయంలో వ్యక్తిపై దాడి జరిగినట్లు ఎస్ఐ మధుసూదన్ సోమవారం తెలిపారు. మండలంలోని ఎస్ రంగాపురం గ్రామంలో పొలం విష యంలో నరేష్, రంగస్వామికి కలచట్ల గ్రామానికి చెందిన తలారి ఆంజినేయులుకు పొలం తగాదా ఉంది. ఈ నేపథ్యంలో నరేష్ ఎస్ రంగాపురం వెళ్తుండగా మార్గం మధ్యలో కలచట్ల దగ్గర ఆంజినేయులుతోపాటు పెద్దరామాంజినేయులు, నాగరాజు, నాగార్జున దాడి చేసినట్లు ఎస్ఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పాము కాటుతో మహిళకు అస్వస్థత

చాగలమర్రి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలుముల పేట గ్రామానికి చెందిన ఓబుళమ్మ పాము కాటుకు గురై సోమవారం అస్వస్థతకు గురైంది. ఓబుళమ్మ పొలానికి వెళ్లి పనులు చేస్తుండగా పాము కాటుకు గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక కేరళ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరు గైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తరలించారు.

ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి సవాల్‌ను స్వీకరిస్తా

- విజయ డెయిరీలో జరిగిన అవినీతిని బయట పెడతా
- టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి



మాట్లాడుతున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీలో అవినీతి నిరూపించాలని చైర్మన్ ఎస్వీ జగన్మోహన్‌రెడ్డి విసిరిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని, త్వరలో విజయ డెయిరీలో జరిగిన అవినీతిని బయట పెడతామని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ ప్రజలు భూమా కుటుంబాన్ని నమ్మి మాకు ఓటు వేసి గెలిపించారన్నారు. ఎస్వీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ ఆస్తులు ఎక్కడెక్కడ కబ్జా చేశారో అన్ని మాదగ్గర ఉన్నాయని, అవి బయట పెడతామన్నారు. మాచినేనిపల్లెలో ఎస్వీ మోహన్‌రెడ్డి డెయిరీ సొసైటీకి నామినేషన్ వేయాల్సి ఉండగా ఇంత హడావిడి ఏనాడు జరగలేదని, అయితే ప్రతి విషయాన్ని బ్లూమీడియా వక్రీకరిస్తుందని విమర్శించారు. మాచినేనిపల్లెలో వైసీపీ నాయకులు ఘర్షణ వాతావరణం సృష్టించాలని చూశారని అన్నారు. అధికారం లేకున్నా ఏనాడు భయపడలేదని, ఇప్పుడు అధికారం ఉన్న అధిష్ఠానం మాటకు కట్టుబడి పోతున్నామని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నన్ను హౌస్ అరెస్టు చేశారని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకులు నాగంజీ, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

దొర్నిపాడు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థి అఖిల్‌ప్రకాష్ తైక్వాండో అండర్-17 విభాగంలో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-17 తైక్వాండో పోటీలో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ఈటానగర్‌లో నవంబరు 26 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థి అఖిల్‌ప్రకాష్, పీఈటీ దేవేంద్రను ఉపాధ్యాయులు సుధాకర్, మౌళాలి, చెన్నయ్య, రవిప్రకాష్, పుల్లయ్య అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు..



విద్యార్థులతో ఉపాధ్యాయులు

బనగానపల్లె, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22న శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ పోటీల్లో అభిషేక్‌రాజ, అశోక్‌నాయక్ ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులతోపాటు ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

చాగలమర్రి: మండలంలోని చింతల చెరువు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్బరాయుడు సోమవారం తెలిపారు. సాఫ్ట్‌బాల్ విభాగంలో వెంకటరమణ, శ్రావణి, బేస్‌బాల్ పోటీల్లో భరత్, అనుమోషిత, శివపుష్పలత, రామచరణ్, పల్లవి, దాక్షయని ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పీడీ దాదాపీర్, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఆళ్లగడ్డ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ సరఫరాను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆళ్లగడ్డ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ బీరువాల బాషా కోరారు. రుద్రవరం మండలం నక్కలదిన్నె గ్రామానికి చెందిన దస్తగిరి బాషాకు సంబంధించిన విద్యుత్ సరఫరాను ముందస్తు నోటీసు ఇవ్వకుండా అన్యాయంగా తొలగించారని, దీంతో ఆ కుటుంబ సభ్యులు గత మూడు రోజులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈవిషయంపై డివిజన్ విద్యుత్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు.

'రైతన్న మీ కోసం'ను విజయవంతం చేద్దాం: ఆర్డీవో

డోన్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని డోన్ ఆర్డీవో నరసింహులు, ఏడీఏ సునీత పిలుపునిచ్చారు. సోమవారం దొరపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం ఈనెల 24 నుంచి 29వ తేదీ వరకు రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్లు, సచివాలయ అధికారులు, గ్రామ అభ్యుదయ రైతు సహకార సంఘం సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులతో గ్రామ కమిటీగా మూడు టీమ్‌లుగా ఏర్పడుతాయన్నారు. ఒక్కొక్క టీమ్ రోజు 30 మంది రైతుల ఇళ్లకు వెళ్లి నీటి భద్రత, డిమాండ్, ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిసెంబరు 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్‌షాపులు నిర్వహించి యాక్షన్ ప్లాన్ గురించి అవగాహన కల్పిస్తామని తెలి పారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, పశుసంవర్ధకశాఖ ఏడీ నాగరాజు, మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఉద్యానశాఖ అధికారి కళ్యాణి, మార్కెటింగ్ సూపర్ వైజర్ శివకుమార్‌రెడ్డి, మండల విస్తరణ అధికారి మధు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అవుకు: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యవసాయాధికారి కలిమున్నీసా అన్నారు. సోమవారం 'రైతన్న మీ కోసం' లో భాగంగా చెన్నంపల్లెలో బనగానపల్లె మార్కెట్‌యార్డు చైర్మన్ కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, రామాపురంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డితో కలసి రైతులకు వ్యవసాయ నూతన ఒరవడులపై అవగాన కల్పించారు. రైతన్న మీకోసం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు, పశువైద్య సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు, పెద్దకందుకూరు గ్రామాలలో జరుగుతున్న రైతన్న మీకోసం కార్యక్రమాన్ని సోమవారం మండల వ్యవసాయాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి పరిశీలించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పార్టీ నాయకులు సిద్ధిసత్యం, శివకుమార్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. అన్నదాతలకు 'రైతన్న మీకోసం' కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సావిత్రి, ఈవోపీఆర్డీ శివప్రసాద్, వ్యవసాయ సంచాలకుడు సుధాకర్, ఏవో ప్రమీల, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రుద్రవరం: 'రైతన్న మీకోసం' అనే పథకాన్ని రైతుల కోసం ప్రభుత్వం అమలు చేసిందని ఏవో సుమతి, తహసీల్దారు ఆల్‌ఫ్రెడ్ ధోనీ అన్నారు. సోమవారం రుద్రవరంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఈవో రాజు, వీపీఏలు గ్లోరీ, టీడీపీ నాయకులు చంద్రశేఖర్; వీఆర్వో సంజీవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన రైతులు: మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో 'రైతన్న మీ కోసం' సర్వేకు వెళ్లిన ఆధికారులను ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్రుడు, రైతులు సోమవారం నిలదీశారు. పంట కొనుగోలు కేంద్రాలు, మద్దతు ధర అమలు చేయాలని, రబీ సీజన్ సాగునీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలంటూ పట్టుబట్టారు.

కొలిమిగుండ్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకో వాలని ఎంపీడీవో దస్తగిరిబాబు, తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. సోమవారం కొలిమిగుండ్లలో రైతన్న మీ కోసం పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతినగర్ కాలనీలో తహసీల్దార్, ఎంపీడీవో, ఏఈవో నాగరాజు రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సుబ్రహ్మణ్యం, శాంతి, వీఆర్వో భార్గవి పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అధికారులు ఇంటింటికి వెళ్లి పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చిన కరపత్రాలను అందజేశారు. ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, వ్యవసాయ ఏడీఏ సునీత, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి కళ్యాణి, టీడీపీ నాయకులు రంజిత్, కిరణ్ పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దారు పవన్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని గుద్దేటిపేటలో రైతన్న మీ కోసం. కార్యక్రమం నిర్వహించారు. అలాగే గుంజలపాడు గ్రామంలో వ్యవసాయాధికారి నిరంజన్ ఆధ్వర్యంలో రైతన్న మీ కోసం.. నిర్వహించారు

చాగలమర్రి: మండలంలోని గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏవో రంగనేతాజీ తెలిపారు. సోమవారం శెట్టివీడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి రైతన్న మీకోసం పోస్టర్లను రైతులకు పంపిణీ చేశారు. వీఆర్వోలు వెంకట్రామిరెడ్డి, సాయినాథ్, కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.

సంజామల: రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కోవెలకుంట్ల వ్యవసాయశాఖ ఏడీఏ సుధాకర్ అన్నారు. సోమవారం ఎగ్గోనిలో రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ ఏడీ కొండారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశంలో సభలో ఆయన మాట్లాడారు. కార్యక్ర మంలో పశువైద్యాధికారి కృష్ణ కుమార్, కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు కార్యదర్శి నారాయణస్వామి, ఏఈవోలు వెంకటేశ్వరరెడ్డి, శ్రీకాంత రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



దొరపల్లిలో రైతులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్డీవో



ఎగ్గోనిలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ సుధాకర్



కోవెలకుంట్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్